క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన నరేందర్

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో ఆదివారం ఏబీవీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అంతయ్య, డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయతను చాటుదాం



జాతీయ జెండాను ఎగురవేసిన శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఆజాదీ కా మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయతను చాటాలాని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా మహోత్సవంలో భాగంగా తన ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన అమర వీరులను స్మరించుకోవాలన్నారు. మహనీయుల పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, నరేశ్ నర్సింహ్మా, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసిన ధర్మసాగర్ గ్రామస్తులు

చేవెళ్ల: తమ గ్రామాన్ని పంచాయతీ ఏర్పాటు చేయాలని ధర్మసాగర్ గ్రామస్తులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. ఆదివారం ధర్మసాగర్ ప్రజలు ఎమ్మెల్యేకకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 500లకు పైగా ఓటర్లు ఉన్నారని, 1,000 మందిపైగా జనాభా ఉందని తెలిపారు. తమ గ్రామం గొల్లపల్లి గ్రామ పంచాయతీలో ఉండడంతో రేషన్ సరుకులు, ఇతర అవసరాల కోసం గొల్లపల్లికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. తమ సమస్యలను గుర్తించి గ్రామ పంచాయతీగా మార్చాలని కోరామని.. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ధర్మసాగర్ గ్రామస్తులు, వార్డు సభ్యులు, యువకులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన కంబాలపల్లి శాంతమ్మ శనివారం మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని ఆదివారం స్థానిక నాయకులు శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, వీరేశ్, వెంకటేశ్, యాదగిరి, నారయ్య, కృష్ణ, చంద్రకాంత్, భాస్కర్, శ్రీను తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సహకారంతో రూ.3 వేలను వారు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

దారి.. అధ్వానంగా మారి



మొయినాబాద్ రూరల్: ఎన్కెపల్లి-బాకారం రోడ్డు దుస్థితి



కొత్తూరు: ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా రోడ్డు



శంకర్‌పల్లి: అధ్వానంగా పత్తేపురం రోడ్డు

- అధికారుల అలసత్వం
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- ప్రజలు, వాహనదారులకు ఇక్కట్లు

మొయినాబాద్ రూరల్: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా ఎన్కెపల్లి-బాకారం రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోయింది. ఏడాది క్రితం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. కానీ సకాలంలో పనులు పూర్తి కాకపోవడంపై పలు గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొయినాబాద్ మండలం ఎన్కెపల్లి, బాకారం రోడ్డు విస్తరణ కోసం 2022 మార్చిలో ప్రభుత్వం రూ. 2.20 కోట్లు విడుదల చేసింది. మార్చి 13న మంత్రి పనులను ప్రారంభించారు. అంతరాష్ట్ర రహదారి నుంచి ఎన్కెపల్లి మీదుగా బాకారం వరకు రోడ్డు పనులను చేపట్టాల్సి ఉంది. కానీ పనులను అధికారులు అర్ధాంతరంగా వదిలేశారు. పనులు పూర్తి కాకపోవడంతో వాహనాదారులు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మోక్షం ఎప్పుడో...

కొత్తూరు: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది కొత్తూరు మున్సిపాలిటీలోని కొత్తూరు-అక్కివానిగూడ రోడ్డు పరిస్థితి. ఎన్నో నిరసనలు, మరెన్నో వినతులతో పాలకులు మంజూరు చేసిన రోడ్డు పనులు ఐదేళ్లుగా కొనసాగుతున్నా.. ఇంకా రోడ్డు పనులు పూర్తి కాలేదు. చిన్న వర్షానికే రోడ్డు చిత్తడిగా మారుతోంది. గుంతలు, బురదమయమైన రోడ్డుపైనే ఎన్నో ఇబ్బందులు పడుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం నుంచి అక్కివానిగూడ వరకు రూ. 1.76 కోట్లతో మంజూరైన బీటీ రోడ్డును ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. కాగా పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్న కాంట్రాక్టర్ నేటికి పనులను పూర్తి చేయలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తాలోని ఇంద్రారెడ్డి విగ్రహం నుంచి పత్తేపురం ఫ్లైఓవర్ వరకు ఉన్న డబుల్ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.06 కోట్లను మంజూరు చేసింది. రోడ్డు పనులకు మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య 2020 జూన్ 10న శంకుస్థాప చేశారు. పనులు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. కాగా.. తీగలవాగుపై బ్రిడ్జి పనులు ఇటీవల పూర్తి చేశారు. కానీ రాకపోకలకు అనుమతించలేదు. రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారోనని స్థానికులు ఎదురు చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎన్కెపల్లి-బాకారం రోడ్డు పనులను ఏడాది క్రితం ప్రారంభించారు. ఇప్పటివరకు ఎన్కెపల్లి వరకే పూర్తి చేసి వదిలేశారు. అసంపూర్తి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలి.

మహేందర్‌ముదిరాజ్, బాకారం గ్రామస్తుడు.

నిధులు సరిపోకపోవడంతో..

ఎన్కెపల్లి-బాకారం రోడ్డు కోసం ప్రభుత్వం రూ. 2.20 కోట్లు నిదులను విడుదల చేసిన మాట వాస్తవమే. నిధులు సరిపోకపోవడంతో పనులు ఆగిపాయాయి. మిగతా రోడ్డు పూర్తి కోసం నిధులు మంజూరు కాగానే పనులను పూర్తి చేస్తాం.

విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డివిజన్ అధికారి

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కేఎస్ రత్నం

చేవెళ్ల: నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు చేవెళ్ల గడ్డకు సేవ చేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం స్పష్టం చేశారు. చేవెళ్ల మండలంలోని సీహెచ్ఆర్ గార్డెన్‌లో ఆదివారం కేఎస్ రత్నం ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇంద్రారెడ్డి శిష్యుడిగా రాజకీయంలోకి వచ్చానని, అనాటి నుంచి నేటి వరకు చేవెళ్ల గడ్డపైనే రాజకీయం చేస్తున్నానని, ప్రాణం ఉన్నంత వరకు చేవెళ్ల ప్రజలకు సేవ చేస్తున్నానని ప్రకటించారు. బీఫామ్‌లు, నామినేటెడ్ పోస్టులు అమ్ముకునే సంస్కృతి తనకు లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. కార్యకర్తలందరూ బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, ఎంపీటీసీ కిష్టయ్య, నాయకులు పాండు, జంగారెడ్డి, రాంచంద్రయ్య, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, విఠలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను మరువలేం

మున్సిపల్ చైర్మన్ నరేందర్



ర్యాలీని ప్రారంభిస్తున్న నరేందర్

షాద్‌నగర్: మహనీయుల త్యాగాలు మరువలేమని మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, సౌత్ జోన్ కల్చర్ సెంటర్ తంజావూర్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో నా మట్టి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నరేందర్ ప్రారంభించి మాట్లాడారు. అందరూ స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటితరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు టీవీ రంగయ్య, శ్రీనివాస్, కళాకారులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొని నైపుణ్యం సాధించాలి

అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపల్



విజేత జట్టుకు రూ.50వేలు చెక్కును అందజేస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్: పోటీతత్వం విజ్ఞానాన్ని పెంచుకోవడానికి దోహదపడుతుందని, ఎక్కడ పోటీలు జరిగినా విద్యార్థులు వాటిలో పాల్గొని తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మొయినాబాద్ మండలంచిలుకూరు అరిస్టాటిల్ పీజీ కళాశాలలో జాతీయ స్థాయి బిజినెస్ ప్లాన్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో వివిధ కళాశాలల నుంచి 68 జట్లు పాల్గొని తాము రూపొందించిన బిజినెస్ ప్రణాళికను ప్రదర్శించాయి. పోటీలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన షేక్ రోషిని జట్టు మొదటి బహుమతిని గెలుచుకోగా, టీకేఆర్ కళాశాలకు చెందిన శేఖర్ టీం రెండో బహుమతిని అందుకుంది. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.50వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.25వేలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్నొవెన్సుల్ టెక్నాలజీ సీఈఓ అనిల్‌కుమార్, ట్రిరైట్ సొల్యూషన్స్ సీఈఓ కిషోర్‌కుమార్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీందర్‌రెడ్డికి 'కాకతీయ వైభవ కీర్తి'



అవార్డును అందుకున్న రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం అధ్యాపకుడిగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి కాకతీయ వైభవ కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. 75వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ఆదివారం హన్మకొండలో ఫిలంత్రోఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, పుడమి సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రవీందర్‌రెడ్డి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా పీహెచ్‌డీలో స్వయం సహాయక సంఘాలు వాటి పనితీరు రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఇన్ ఇండియా అనే అంశాలపై ఆయన రాసిన వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. అందువల్ల ఆయనకు వైభవ కీర్తి పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వ నాటక అకాడమీ సభ్యురాలు ఎస్‌పీ భారతి, ఉత్తర అమెరికా తెలుగు సభల అంతర్జాతీయ సమన్వయ కర్త చిగురుమల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

లక్ష్యం ముందు ఓడిన పేదరికం



ఎస్ఐ ఉద్యోగాలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

షాబాద్: కృషి పట్టుదలతో చదివి ఎస్ఐ ఉద్యోగాలకు ఎంపికైన యువకులను ఆదర్శంగా తీసుకోవాలని కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని అన్‌మోల్ గార్డెన్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో వెంకమ్మగూడ గ్రామానికి చెందిన రాజేందర్, బోడంపహాడ్ గ్రామానికి చెందిన మల్లేశ్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యం ముందు పేదరికం ఓడిందన్నారు. రైతు బిడ్డలు ఎస్ఐలుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేశారని కొనియాడారు. ఎస్ఐగా ఉద్యోగాలు సాధించడంతో వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు, నాయకులు చెన్నయ్య, ఒగ్గు రాజు, సత్యనారాయణ, వెంకటయ్య, శివ, లింగం, వెంకటేశ్, నర్సింహులు తదితరులున్నారు.

ప్రజా సమస్యలు కనిపించడం లేదా?

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: అభివృద్ధిలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపామని గొప్పలు చెపుతున్న పాలకులకు సమస్యలు కనిపించడం లేదా అని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ప్రశ్నించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని రాసుమల్లగూడ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గరవుతున్నారని తెలిపారు. రాసుమల్లగూడ రహదారి బురదమయంగా మారడంతో రైతులు, విద్యార్థులు, గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులను పడుతున్నారని తెలిపారు. రాసుమల్లగూడ రహదారి సమస్యను పరిష్కరించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు హైదర్‌గోరి, శివరాములు, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, రాజు, పాండుగౌడ్, మసూద్‌ఖాన్, ముబారక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ కాలనీలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలతో నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. కాంగ్రెస్‌ను ఆదరిస్తే మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాటుకాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తూరు: మండలంలోని ప్రధాన చెరువులకు వరద నీటి ప్రవాహాన్ని తీసుకొచ్చే పాటుకాల్వలకు అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కొత్తూరు మత్స్యశాఖ సంఘం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో సంబంధితశాఖల అధికారులను కోరారు. వెంచర్ల ఏర్పాటు కారణంగా ఇప్పటికే పలు గ్రామాల్లో కాల్వలను వ్యాపారులు ధ్వంసం చేసినట్లు వివరించారు. మరికొన్ని చోట్ల ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన కాల్వలను దారి మళ్లించడంతో వరద ప్రవాహం రోడ్లు, పంట పొలాల్లో పారుతోందన్నారు. ఇప్పటికైన ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కార్మికులకు అండగా 'సీఐటీయూ'



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న అల్లి దేవేందర్

షాబాద్: సీఐటీయూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ, ఆశ, అంగన్‌వాడీ, మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నర్సింహా, పంచాయతీ కార్మికులు రవి, పగులయ్య, సురేశ్, బాబయ్య, రవి తదితరులున్నారు.

శేరిగూడలో పోచమ్మ అమ్మవారి బోనాలు

ఫలహార బండి ఊరేగింపు



ఫలహార బండి ఉరేగింపులో బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం: శేరిగూడ గ్రామంలోని పోచమ్మ అమ్మవారి బోనాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఉరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు అల్వాల వెంకట్‌రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు మొద్దు అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్ రూరల్: చదువులమ్మ చెట్టు నీడలో అక్షర సాధనే లక్ష్యంగా... ఆటలు పాటలే ఆనందంగా.. పాతికేళ్ల క్రితం ఒకే దగ్గర చదువుకున్నారు. జీవితంలో స్థిరపడ్డాక తిరిగి ఒక చోటకు చేరుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను, అనుభవాలను నెమరు వేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. పట్టణంలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో 1995-96 ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా కళాశాల ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరు ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి, కరస్పాండెంట్ మహేందర్‌రెడ్డి, అధ్యాపకుడు శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు సత్యకుమార్, గిరిజ, స్వప్న, ప్రేమలత, వనిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లకు వెళ్లిన పద్మశాలీలు

ఆమనగల్లు: కోరుట్లలో జరిగిన పద్మశాలీ రాజకీయ యుద్ధబేరి మహాసభకు ఆమనగల్లు నుంచి పలువురు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పద్మశాలీసంఘం నాయకులు మాట్లాడుతూ పద్మశాలీయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, అప్పం శ్రీను, మామిడిశెట్టి రవి, శివలింగం, వాసు, భాస్కర్, యాదగిరి, అప్పి, శ్రీనివాస్, సత్యరాములు, తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లకు వెళ్లిన పద్మశాలీసంఘం నాయకులు

దాతలు.. దయ చూపరూ

- నిలిచిన ఎంపీడీఓ భవన నిర్మాణ పనులు
- శంకుస్థాపన చేసి మూడేళ్లు



అసంపూర్తిగా ఎంపీడీఓ భవన నిర్మాణ పనులు

నందిగామ: 'నూతనంగా ఏర్పడిన నందిగామ మండల కేంద్రంలో ఎంపీడీఓ భవనాన్ని నిర్మించేందుకు దాతలు ముందుకు రావడం శుభసూచికం, స్థానికంగా ఉన్న రెండు పరిశ్రమలు, ఓ ట్రస్ట్ భవనాన్ని నిర్మించి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వారి సహకారంతో త్వరలోనే ఎంపీడీఓ భవనం పూర్తవుతోంది.' ఇదీ ఎంపీ మన్నే శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన రోజు అన్న మాటలివి. కానీ భూమి పూజ చేసి మూడేళ్లు దాటిన దాతలు దయ చూపకపోవడంతో భవన నిర్మాణ పనులు బెస్‌మెంట్ లేవల్‌లోనే నిలిచిపోయాయి.

అద్దెభవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

మండలాల విభజనలో కొత్తూరు నుంచి 8 గ్రామ పంచాయితీలను విడదీసీ నందిగామ మండలం ఏర్పాటు చేశారు. అనంతరం నూతన గ్రామ పంచాయితీల ఏర్పాటులో భాగంగా 8 గ్రామ పంచాయితీల్లోని అనుబంధ గ్రామాలు, తాండలను విడదీసీ మరో 10 నూతన గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేశారు. దీంతో నందిగామ మండలంలో 18 గ్రామ పంచాయితీలు ఏర్పడ్డాయి. నూతనంగా మండలాన్ని ఏర్పాటు చేసినా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో పాటు మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు నూతనంగా ఎంపీడీఓ భవనాన్ని నిర్మించాలని సంకల్పించారు. అనంతరం రెండు పరిశ్రమలు, ఓ ట్రస్ట్ నిర్వహకులు ఎంపీడీఓ భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. దీంతో 2020 జూన్ 10వ తేదీన ఎంపీ, ఎమ్మెల్యే ఎంపీడీఓ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండల పరిషత్ నిధులతో బేస్‌మెంట్ వరకు నిర్మాణం పనులు చేపట్టారు. ఈ పనుల వేగం చూసి త్వరలోనే ఎంపీడీఓ భవన నిర్మాణం పూర్తవుతోందని అందరూ భావించారు. కానీ దాతలు పట్టించుకోలేకపోవడంతో మూడేళ్లుగా నిర్మాణం పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి.

ఎమ్మెల్యే సహకారంతో..



ఎంపీడీఓ భవన నిర్మాణానికి దాతలు దయ తలిస్తే త్వరలోనే భవన నిర్మాణం పూర్తవుతుంది. ఎమ్మెల్యే సహకారంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

ప్రియాంక, ఎంపీపీ, నందిగామ మండలం